తాజా పదార్థాలనే విక్రయించాలి : కమిషనర్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్: కొనుగోలుదారులకు ఎల్లవేళలా నాణ్యమైన తాజాపదార్థాలను విక్రయం చాలని మున్సిపల్ కమిషనర్ జి.రవి పేర్కొన్నారు. శనివారం ఆయన పట్టణం రోడ్డులోని లక్ష్మి బేకరీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. బేకరీలో తయారు చేసిన పదార్థాలతో పాటు తయారు చేస్తున్న వాటిని కూడా పరిశీలించారు. కేకులు తయారయ్యే కిచెన్‌ను, వాడుతున్న పదార్థాలు, కేక్‌లో ఉపయోగించే ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. అనంతరం బేకరీ యజమానికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలని, వాటికి మూతలు పెట్టాలని, ఎల్లప్పుడూ తాజా పదార్థాలు మాత్రమే వినియోగించాలని ఆదేశించారు. అనంతరం బేకరీ యజమానికి రూ.500 జరిమానా విధించి, మున్సిపల్ ఖజానాలో జమ చేయాలంటూ ఆదేశం చారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

కిచెన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రవి

ధరలు ఢమాల్

- భారీగా తగ్గిన టమోటా ధరలు
- మొదటి రకం కిలో రూ.10లోపే
- రెండో రకం రూ.6-7
- పంట పెట్టుబడి చేతికందని వైనం
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టమోటా దిగుబడి తగ్గినప్పటికీ ధరలు అమాంతం పతన మయ్యాయి. మొదటి రకం టమోటా కిలో రూ.10 లోపే పలుకుతోంది. పంట సాగుకు వెచ్చించిన ఖర్చులు కూడా చేతికి రాకపోవడంతో రైతులు ఆర్థిక నష్టా లతో సతమతమవుతున్నారు. మదనపల్లె, తంబళ్లపల్లి, పుంగనూరు, పీలేరు నియోజకవర్గాల్లో రైతులు వరి తర్వాత ఎక్కువ హెక్టార్లలో టమోటా పంట సాగు చేస్తుంటారు. గతంతో పోల్చుకుంటే పంట సాగు ఖర్చు, కూలీ రేట్లు రెట్టింపు అయ్యాయి. ప్రస్తుతం ఒక ఎకరా టమోటా సాగు చేయడానికి రూ.1.5 లక్షల నుండి రూ.2 లక్షల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. కొంతమంది రైతులు సొంత పొలంలో టమోటా సాగుచేస్తూ ఉండగా మరి కొంతమంది రైతులు భూమిని కౌలుకు తీసుకొని ఈ పంట సాగు చేస్తారు. కౌలు చేసుకునే రైతులకు గుత్త చెల్లించాల్సి ఉండడంతో అదనపు భారం పడుతుంది. టమోటా నారు నాటి నప్పటినుంచి పంట చేతికి వచ్చేవరకు వీడలు, తెగుళ్ల బారి నుండి నుంచి కాపాడుకునేందుకు తరచూ క్రిమిసంహారక మందులు పిచికారి చేయా ల్సి ఉంది. చెట్లలో కలుపు తీయడం, కట్టెలు నాటడం తదితర ఖర్చులు చేస్తే తప్ప మంచి దిగుబడి రాదు. ఇంత ఖర్చు చేసి పంటచేతికొస్తే పంటను ఒడువు కోవడానికి కూలీ రేట్లు అధికంగా చెల్లించాలి, పంటను మార్కెట్‌కు తరలించ చాలంటే రవాణా ఖర్చులు భరించాలి. ఇంత భారం పడుతున్న నేపథ్యంలో టమోటా ధరలు పతనం కావడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపో తున్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి పండించిన టమోటాలను ఆసియాలోనే ప్రసిద్ధిగాంచిన మదనపల్లె పట్టణం, నీరుగట్టువారిపల్లెలోని టమోటా మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. కొన్ని సమయాల్లో ఇతర ప్రాంతాల్లో టమోటా సాగు తక్కువ ఉన్నప్పుడు ఇక్కడ ధరలు ఎక్కువగా ఉంటాయని, అన్ని ప్రాంతాల్లో టమోటా సాగు ఎక్కువ ఉన్నప్పుడు ఇక్కడ ధరలు లేకపోవడం సర్వసాధారణం. ప్రస్తుతం నీరుగట్టువారిపల్లి టమోటా మార్కెట్ మొదటి రకం 30 కిలోల క్రేట్ ధర రూ.250 నుండి రూ.300 వరకు పలుకుతుండగా, రెండవ రకం క్రేట్ ధర రూ.100 నుండి రూ.200 వరకు మాత్రమే పలుకు తోంది. రైతులు తీవ్రనష్టాలను చవిచూసి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. రూ.లక్షలు ఖర్చుపెట్టి టమోటాలను సాగు చేస్తే ధరలు పడిపోవడంతో తమకు తీవ్ర నిరాశ ఎదురైందన్నారు. రసాయన మందులు పిచికారి చేయడానికి రూ.వేలు, ప్రస్తుతం దినసరి కూలీ రూ.500 నుండి రూ.700 పెరిగిపోవడం రైతులకు మరింత భారంగా మారాయి. పంట పెట్టుబడి చేతికి రావాలన్నా ఆదాయం దక్కాలన్నా క్రేట్ ధర కనీసం రూ.700 నుండి రూ.900 వరకు పల కాలన్నారు. వ్యాపారులకు ఇతర ప్రాంతాల్లో సరుకు లభిస్తుండడంతో అటు నుండి ఆటో వెళ్లిపోతున్నారు. మహారాష్ట్ర, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలలో సైతం టమోటా పండిస్తుండడంతో ఎగుమతులు తగ్గాయి. ఇది ధరల పతనానికి ఒక కారణమని విశ్లేషకులు చెబుతున్నారు. సీజన్ ప్రారంభమై రెండు నెలలు అవుతోంది. దిగుబడి తగ్గింది. వాస్తవంగా ఈ సమయంలో ధరలు తారా స్థాయిలో ఉండాలి. అయినా ధరలు తగ్గుముఖం పడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాదిన్నర అవుతున్నా పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రూ.20 వేలు అందాల్సి ఉండగా కేవలం కేంద్ర సాయంతో కలిసి రూ.7 వేలు అందించి. మరికొంతమందిరైతులకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పుణ్యమా అని లబ్ధి చేకూరలేదు. ప్రభుత్వం స్పందించి టమోటా రైతులను పెంచి రైతులను ఆదుకో వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెంద తాయని, అటువంటి రైతులు కష్టాల్లో పడితే దేశ అభివృద్ధికి మంచి సంకేతం కాదన్నారు. రైతులకు పెట్టుబడి సాయం మరింత పెంచి సకాలంలో అందిం చాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డివిజన్ రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మదనపల్లి మార్కెట్‌కు వచ్చిన టమోటాలు

పెట్టుబడి కూడా రాలేదు

రెండు ఎకరాలు టమోటా పంట సాగు చేశాను. రూ.4 లక్షలు ఖర్చు చేశాను. ఇప్పటికి మూడు కోతలు కోశాను. రూ.లక్ష కూడా రాలేదు. మరో మూడు కోతలు కోస్తే పంట అయిపోతుంది. ధరలు చూస్తే తీవ్రంగా నష్టపోయాను. రైతు ఎలా బాగుపడేది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- రమణ, రైతు, బండ్రేవు.

గిట్టుబాటు ధర కల్పించాలి

ఎకరా టమాటా పంట సాగు చేశా. రూ.2 లక్షలు ఖర్చయ్యాయి. ఇప్పుడే కోత మొదలైంది. ధరలు చూస్తే క్రేట్ రూ.300 కూడా పలకట్లేదు. ఇలా అయితే రైతు బాగుపడేదెలా. ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తే రైతుకు ఆసరాగా ఉంటుంది.

- రెడ్డప్ప, రైతు, సిద్దవరం.

జాక్‌పాట్ వల్ల మరింత నష్టం

తాము ఎంతో కష్టపడి పండించిన పంటను అష్టకష్టాలు పడి మార్కెట్ తెస్తే వ్యాపారులు 100 క్రేట్లకు పది క్రేట్లు జాక్‌పాట్ వేస్తున్నారు. 90 క్రేట్లకే ధర చెల్లిస్తారు. ధరలు పతనమయ్యాయి. రైతు మరింతగా నష్టపోతున్నాడు. జాక్‌పాట్‌ను రద్దుచేసే పారదర్శకంగా వేలంపాటలు నిర్వహించాలి.

- వాలినాయక్, రైతు, పెద్దమండ్యం.

ఎగుమతి లేక ధరలు తగ్గాయి

పక్క రాష్ట్రాలకు ఎగుమతులు పెద్దగా లేవు. దిగుబడి తగ్గినప్పటికీ ధరలు పతనమయ్యాయి. పది రోజులుగా మదనపల్లె మార్కెట్‌కు 100 నుంచి 130 మెట్రిక్ టన్నుల్లోపే పంట వస్తోంది. 120 మంది బయ్యర్లు ఉండగా 20 మంది బయ్యర్లు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఎగుమతులు లేకపోవడంతో ధర కూడా పతనమైంది. మార్కెట్లో జాక్‌పాట్ నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. రైతుకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రయత్నాలు చేస్తాం.

- జగదీష్, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ, మదనపల్లె.

కడప, అన్నమయ్య ఎస్‌పిలు బదిలీ

కడప ఎస్‌పిగా నచికేత్, అన్నమయ్య ఎస్‌పిగా ధీరజ్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి/రాయచోటి టౌన్

కడప, అన్నమయ్య జిల్లాల ఎస్‌పిలు బదిలీ అయ్యారు. ప్రభుత్వం శనివారం రాష్ట్రంలోని 14 జిల్లాలకు చెందిన ఎస్‌పిలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏడుగురు ఎస్‌పిలు కొత్తవారు కావడం గమనార్హం. కొత్త కేటగిరీకి చెందిన అధికారులే కడప, అన్నమయ్య జిల్లాలకు కొత్త ఎస్‌పిలుగా బాధ్యతలు చేపట్టనున్నారు. కడప జిల్లా ఎస్‌పిగా నచికేత్ నియమితులయ్యారు. ప్రస్తుత ఎస్‌పి ఇ.జి.అశోక్‌కుమార్ 2025 జనవరి 24న బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈయన హయాంలో ప్రతిష్టాత్మక పులివెందుల, ఒంటిమిట్ట జడ్‌పిటిసి ఉపఎన్నికలు జయప్రదంగా నిర్వహించారు. ఈయన్ను ఎక్కడికి పోస్టింగ్ ఇచ్చినదీ తెలియాల్సి ఉంది. పాడేరులో అదనపు ఎస్‌పిగా పనిచేస్తున్న కె.ధీరజ్‌ను ఉద్యోగోన్నతి కల్పిస్తూ అన్నమయ్య జిల్లా ఎస్‌పిగా నియమించింది. ప్రస్తుత ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు ఏడాది కిందట బాధ్యతలు స్వీకరించారు. ఆయన జిల్లాలో అనేక సంచలనాత్మక హత్య కేసులతో పాటు దోపిడీ కేసులు సమస్యాత్మక కేసులను ఛేదించి తనదైన గుర్తింపును తెచ్చుకున్నారు. అనంతరం రాష్ట్రంలో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో అప్పటి కడప ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు స్థానంలో కడప జిల్లా ఎస్‌పిగా అదనపు బాధ్యతలు సైతం నిర్వహించారు. ప్రస్తుతం ఈయన్ను కృష్ణా జిల్లాకు బదిలీ చేసింది.

కడప ఎస్‌పి నచికేత్

అన్నమయ్య ఎస్‌పి ధీరజ్

కూటమిలో లుకలుకలు!

- జిజిహెచ్ డైరెక్టర్ల నియామకంలో విభేదాలు
- టిడిపి జిల్లా అధ్యక్షుడిపై బిజెపి తీవ్ర విమర్శలు
- రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని వెల్లడి
- జమ్మలమడుగులోనూ నివురుగప్పిన నిప్పులే?!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా కూటమిలో లుకలుకలు తీవ్రరూపం దాల్చాయి. జిల్లాలోని కడప, జమ్మలమడుగు, నియోజకవర్గాల్లో కూటమిలో టిడిపి, బిజెపి, జనసేన నాయకుల మధ్య పరిస్థితి నివురు గప్పిన నిప్పును తలపిస్తోంది. ఎమ్మెల్యేల లెటర్ల ఇవ్వడం దగ్గర నుంచి, తమ అనుచరులకు పనులు చేయమని చెప్పడం వెరసి నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయడం వరకు కూటమి నాయకుల్లో ఐక్యత కొరవడింది. తాజాగా కడప పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి జిజిహెచ్ పాలక మండలి డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయడం వివాదాస్పదంగా మారింది. కోర్టుల పరిధిలోని పిపి వంటి నామినేటెడ్ పోస్టుల భర్తీ వ్యవహారాల్లో కూటమి నేతలను లెక్కచేయకుండా ఏకపక్షంగా వ్యవహరించడంపై కూటమిలో విబేధాలు నెలకొన్నట్లు తెలుస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసి గెలిచిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి టిడిపి, బిజెపి, జనసేన అధ్యక్షులు పరస్పరం సంప్రదింపులు చేసిన అనంతరం నామినేటెడ్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉన్న సంగతిని బిజెపి ఎత్తి చూపుతోంది. ఇటువంటి సంప్రదాయాన్ని తుంగలో తొక్కి బిజెపి తరుపున కేబినెట్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ పరిధిలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వ్యవహారంలో జోక్యం చేసుకోవడం ఏమిటని, డైరెక్టర్ వంటి నామినేటెడ్ పోస్టులను ఎలా భర్తీ చేస్తారని బిజెపి అధ్యక్షులు వెంకట సుబ్బారెడ్డి నిలదీస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని వ్యాఖ్యానించడం కూటమి నాయకుల్లో విబేధాల తీవ్రతకు అద్దం పడుతోంది. జమ్మలమడుగు నియోజకవర్గంలో బిజెపి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సి.భూపేష్‌రెడ్డి మొన్నటి వరకు ఉప్పు నిప్పుగా ఉన్న సంగతి తెలిసిందే. ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులైన బాబాయ్, అబ్బాయ్‌లే కావడంతో విభేదాలు పూర్తిస్థాయిలో బయటికి పొక్కని పరిస్థితి కనిపిస్తోంది. ఏదేమైనప్పటికీ జిల్లాలోని కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య అనైక్యత క్రమేణా పతాకస్థాయికి చేరుకుంటోందనే వాదన వినిపిస్తోంది.

'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు నరసింహ డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవు రోజైన రెండవ శనివారం తరగతులు నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థల వద్దకు ఎస్ఎఫ్ఐ నాయకులు వెళ్లి తరగతులను బంద్ చేసి విద్యార్థులను బయటకు పంపివేశారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాల, డైమండ్ స్కూల్, శ్రీ చైతన్య , భాష్యం తదితర ప్రయివేట్ పాఠశాలల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తే విద్యార్థులు మానసిక వేదనకు గురవుతారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏమో సెలవు రోజులలో తరగతులు నిర్వహించకూడదని ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని పాఠశాలలు, కళాశాలలు బేఖాతర్ చేస్తున్నా విద్యాశాఖాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు సెలవు రోజులలో తరగతులు నిర్వహిస్తున్న ప్రయివేట్, కార్పొరేట్ కళాశాల, ప్రయివేట్ స్కూల్ యాజమాన్యాల పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తరగతులు నిర్వహిస్తున్న స్కూల్, కళాశాల ముందు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆఫ్రిద్, జిల్లా కమిటీ సభ్యులు జయబాబు, ఎస్ఎఫ్ఐ నాయకులు హమీద్, మనోజ్, అనిల్, హేమంత్ పాల్గొన్నారు.

తరగతులను బహిష్కరించి విద్యార్థులను ఇంటికి పంపిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

- యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి-పీలేరు

ప్రభుత్వ ఉద్యోగులకు అందాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అన్నమయ్య జిల్లా యుటిఎఫ్ కార్యదర్శుల సమావేశం పీలేరులో జిల్లా అధ్యక్షులు హరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా రంగంలో అనేక సమస్యలు పేరుకుపోయాయని వాటిని వెంటనే పరిష్కరించాలని విద్యాశాఖ మాత్యులు శాఖకు సంబంధించిన అంశాలపై శ్రద్ధ చూపడంలేదని, ఉపాధ్యాయుల పట్ల శ్రద్ధ చూపి వారి సమస్యలను పరిష్కరిచాల పేర్కొన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థికబకాయిలు పేరుకుపోయాయని, ప్రభుత్వం వాటి పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి చూపటంలేదని చెప్పారు. ఇప్పటికైనా ఉద్యోగులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని మరోసారి డిమాండ్ చేశారు. ఉద్యోగుల పిఆర్సి బకాయిలు, నాలుగు డిఎలు, అరియర్స్ చెల్లించాలని, 2022లో పెట్టిన సంపాదిత సెలవు వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు. జిల్లా గౌరవ అధ్యక్షులు శివారెడ్డి మాట్లాడుతూ విద్యాసంస్థల్లో గత ప్రభుత్వం చేపట్టిన నాడు నేడు పనులు ఎక్కడివి అక్కడ ఆగిపోయాయని, వాటిని పూర్తి చేయాలని కోరారు. ఈ సమావేశంలో యుటిఎఫ్ రణభేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ నెల 15న ప్రారంభం కానున్న యుటిఎఫ్ ఆర్థిక బకాయిల కోసం తలపెట్టిన పోరాట కార్యక్రమం రణభేరి బైక్ ర్యాలీలో ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ సదాశివరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉపయోగించు కోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు యాపుల నుంచి విముక్తి కలిగించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ట్రెజరర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ డిఎస్‌సిలో ఎంపికైన వారికి వెంటనే నియామకాలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆదినారాయణ, సుధాకర్ నాయుడు, అక్రమ్ బాష, దావుద్దీన్, సురేందర్ రెడ్డి, రమణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, మండల నాయకులు సుధాకర్, వేణుగోపాల్, విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

భాషా పండిట్ల సమస్యలను పరిష్కరించాలి

- ఎన్‌ఇఎ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - రాయచోటి : రాష్ట్రంలో చాలా ఏళ్లుగా డిఇఒ పూల్‌లో పనిచేస్తూ ఉపాధ్యాయ బదిలీలు అయిన ప్రతిసారి శాశ్వత స్థానాలు లేక ఇబ్బంది పడుతున్న లాంగ్వేజ్ పండిట్ల సమస్యకు ఒక శాశ్వత పరిష్కారం చూపాలని నోబెల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్‌టిఎ) రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని డైట్ పాఠశాలలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన లాంగ్వేజ్ పండిట్‌లు కలిసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండిట్, పిఇటి వ్యవస్థ రద్దయి సుమారు ఆరేళ్లు పూర్తయినప్పటికీ సరిపడా పాఠశాల సహాయకులు పోస్టులు లేని కారణంగా రాష్ట్రంలో చాలా మంది పండిట్‌లు డిఇఒపూల్‌లో పని చేస్తూ ఉద్యోగోన్నతికి నోచుకోక, శాశ్వత స్థానాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ విషయంలో పండితులు కోర్టును ఆశ్రయించగా గౌరవ కోర్టు కూడా వారికి అనుకూలము తీర్పు ఇచ్చిన సందర్భంగా పండితుల ఇబ్బందులు పరిష్కరించే విధంగా ఒక శాశ్వత పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు. వీలైనంత త్వరలో ప్రభుత్వంతోనూ, పాఠశాల విద్యా శాఖ అధికారులతోనూ మాట్లాడి వెంటనే పరిష్కారం వచ్చేలా కృషి చేస్తామని తనను కలిసిన పండితులకు శ్రీనివాసరాజు తెలియజేశారు. కార్యక్రమంలో పండిట్ నాయకులు బి.శ్రీనివాస దేవేంద్ర, శ్రీనివాస, కిరణ్ కుమార్, తిరుపాలు నాయక్, మురళి, శృతి, లావణ్య, రొటీనాయక్ పాల్గొన్నారు.

శ్రీనివాసరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

మాట్లాడుతున్న అదనపు జడ్జి శ్రీలత

లోక్ అదాలత్‌లో 78 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-పీలేరు: పీలేరులో శనివారం నిర్వహించిన జాతీయలోక్ అదాలత్‌లో 78 కేసులు పరిష్కరించి రూ.24,28,548 రికవరీ చేసినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. శనివారం స్థానిక న్యాయస్థానాల్లో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో రెండు బెంచీలు ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్‌ను ఇన్‌ఛార్జి 11వ అదనపు జిల్లా జడ్జి ఆర్.శ్రీలత, రెండవ బెంచ్‌ను ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి షేక్. జియావుద్దీన్ నిర్వహించారు. కక్షిదారుల మధ్య కుదిరిన రాజీమార్గంతో ఈ రెండు బెంచిల్లోనూ 78 కేసులు పరిష్కరించారు. బెంచ్ సభ్యులుగా వి. చిన్న రెడ్డప్ప, పి.వి. రమణారెడ్డి వ్యవహరించారు. కార్యక్రమంలో బార్ అధ్యక్షులు బిసి పురుషోత్తం రెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేసిన న్యాయవాదులు, పోలీస్ అధికారులు, ఎక్సైజ్ అధికారులు, కోర్టు కానిస్టేబుళ్లకు జడ్జిలు ధన్యవాదాలు తెలియజేశారు. **లక్కిరెడ్డిపల్లి :** రాజీతోనే రాజవర్గమని లక్కిరెడ్డిపల్లి సివిల్ జడ్జి భరత్ కమల్ పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ రూ.8,70,749 రికవరీ అయినట్టు తెలిపారు. సివిల్, క్రిమినల్, భూతగాధాలు, పాత బకాయిలు సమస్యలు పరిష్కారమయ్యాయి. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.ఎల్.రామచంద్రారెడ్డి, బాలాజీరెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు

ప్రత్యేక పరిశ్రమను సందర్శించిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో మూడో సంవత్సరం బిటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులు తిరుపతిలోని ప్రత్యేక పరిశ్రమను శనివారం సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ప్రతిష్టాత్మకమైన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తిరుపతి (ఐఐటి)లోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ రీసెర్చ్ ల్యాబ్ ను సందర్శించారు. పర్యటన సందర్భంగా ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ మామిళ్ల రవి శంకర్ విద్యార్థులతో చర్చిస్తూ ఆధునిక సాంకేతిక పరికరాలు, డిజైన్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ప్రక్రియలు, రోబోటిక్స్, ఆటోమేషన్ టెక్నాలజీలు, అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్ టెస్టింగ్ పద్ధతులు, 3డి ప్రింటింగ్, సిమ్యులేషన్, రీసెర్చ్ ప్రాజెక్టుల నిర్వహణపై విశదీకరించారు. విద్యార్థులకు ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎంతో ముఖ్యమని, పరిశ్రమలు, పరిశోధన కేంద్రాలను సందర్శించడం ద్వారా ఆధునిక పరిశోధనలపై అవగాహన పెరుగుతుందని ఆయన అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పరిశోధన ప్రోత్సాహకాలను సమర్థ వంతంగా వినియోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఐఐటి తిరుపతి నిపుణులతో అక్కడ జరుగుతున్న ప్రాజెక్టులు, ఇండస్ట్రీ-అకాడమిక్ కలయిక అవకాశాలు, ఇంటర్న్‌షిప్‌లు, భవిష్యత్ పరిశోధన దిశలు, హైఎండ్ టెక్నాలజీ శిక్షణలపై సమగ్ర అవగాహన పొందారు. ల్యాబ్‌లో జరిగిన ప్రయోగాలు, డెమోన్‌స్ట్రేషన్లు విద్యార్థుల్లో ఉత్సాహం, జిజ్ఞాసను పెంచాయి. కార్యక్రమంలో స్టూడెంట్స్ కో-ఆర్డినేటర్ పి.రాజేష్, డాక్టర్ రూప శ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

మండల వాసికి ఆలిండియా ర్యాంక్

ప్రజాశక్తి-రామాపురం: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురం చెందిన ఏనుగుల నవీన్ హార్టికల్చర్‌లో పిహెచ్‌డి చేయడానికి ఎంట్రెన్స్ ఎగ్జామ్ రాశారు. ఇందులో ఆయన జాతీయ స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించారు. చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకున్న నవీన్ ఒకటి నుండి 8 వరకు వేంపల్లి శ్రీ శారద హై స్కూల్, 9 10 జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చదివారు. అనంతపురం జిల్లామడకశిర హార్టికల్చర్ డిప్లమా, అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు అనంతరాజుపేటలో బిఎస్‌సి, ఎంఎస్‌సి పూర్తి చేశారు. హార్టికల్చర్‌లోనే పిహెచ్‌డి చేయడానికి ప్రవేశ పరీక్ష రాయగా ఆలిండియా స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించడంతో పలువురు నవీన్‌ను ప్రశంసించారు. తల్లి అంగన్వాడీ టీచర్‌గా పనిచేస్తూనే తన కుమారుని ఉన్నత చదువు చదివించారు.



నవీన్

నూతనోత్సాహం

ప్రజాదృష్టి

జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాలు అంచనాలకు మించి జయప్రదమయ్యాయి. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కేడర్‌లో నూతనోత్సాహం తొణికిసలాడుతోంది. జిల్లాలోని సాధారణ ప్రజా సంఘం జాతీయ స్థాయి సమావేశాలను ఊహించని రీతిలో జయప్రదం చేయడం ప్రశంసనీయం. అరుదైన అవకాశాన్ని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకుని జయప్రదం చేయడంతో వ్యవసాయ కార్మిక సంఘం సత్తాను చాటుకుంది. గతంలో సిఐటియు, ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ వంటి ప్రజాసంఘాలు రాష్ట్ర స్థాయి పిలుపులను, సమావేశాలను జయప్రదం తెలిసిందే. పెద్దఎత్తున సభ్యత్వాలు ఉండడం తెలిసిందే. ప్రభుత్వ, పారిశ్రామిక అనుబంధ సంస్థల్లోని కార్మికుల్లో చైతన్యం పాలు ఎక్కువ కావడం తెలిసిందే. ప్రజా సంఘాలు రాష్ట్ర స్థాయి సమావేశాలను నిర్వహించి జయప్రదం చేయడంలో ఆశ్చర్యం లేదు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం భిన్నమైన నేపథ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ కార్మిక సంఘం అందరిని కలుపుకుని వెళ్లి జిల్లాలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహణలతో తమ సత్తాను నిరూపించుకుంది. జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టిన ఉద్యమ కార్యకలాపాలకు, భారీ ర్యాలీ, బహిరంగసభలు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాల కారణంగా సాగు ఊపందుకుంది. జిల్లా వ్యవసాయశాఖ గతేడాది ఎరువుల వినియోగాన్ని బట్టి యూరియా సహా ఇతర రకాల ఎరువులను అందుబాటులో ఉంచాల్సి. కానీ జిల్లా వ్యవసాయశాఖ అటువంటి ప్రయత్నం చేయడంలో విఫలమైంది. ఫలితంగా జిల్లాలో యూరియా కొరత తీవ్రరూపం దాల్చింది. జిల్లా రైతాంగం యూరియా కోసం దుకాణాల ఎదుట బారులు దీరాల్సి దుస్థితి దాపురించింది. రైతు సంఘాల నుంచి పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తడంతో ప్రభుత్వం ఉలిక్కి పడింది. జిల్లాలో యూరియా కొరత లేదని కలెక్టర్, ఎస్పీ స్థాయి ఉన్నతాధికారులు పలుమార్లు వివరించాల్సి వచ్చింది. జిల్లా ఉన్నతాధికారులు యూరియాపై కొరత లేదని పలుమార్లు చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో వాస్తవాలకు పొంతన లేకుండా ఉంటోంది. జిల్లాలోని తెలుగుగంగ, కుందూ, కెసి కెనాల్ ప్రాంతాల్లో సాగు ఊపందుకోవడంతో యూరియా కోసం రైతులు ఎగబడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఫెర్టిలైజర్ దుకాణదారులు అధిక ధరలకు విక్రయిస్తుండడం పరిపాటిగా మారింది. జిల్లా వ్యవసాయశాఖ రైతులు యూరియా వినియోగాన్ని రెట్టింపు చేయడం వల్లే సమస్య తలెత్తిందని చెబుతోంది. వ్యవసాయ శాఖ చెబుతున్న వాదనకు ఎరువుల దుకాణాల దగ్గర రైతులు బారులు తీరడాన్ని పరిశీలిస్తే పొంతన లేదని తెలుస్తోంది. ఒకవేళ అధిక వినియోగం చేస్తున్న మాట నిజమైతే అటువంటి రైతుల సంఖ్య చేతి వేళ్ల మీద లెక్కించ వచ్చుననే వాదన వినిపిస్తోంది. ప్రభుత్వం యూరియా వినియోగాన్ని తగ్గించాలనే కేంద్రం ఆదేశాలను అమలు చేయడం వల్లే సమస్య ఏర్పడిందనే వాదన పెద్దఎత్తున వినిపిస్తోంది. జిల్లా వ్యవసాయశాఖ చేపట్టిన విజిలెన్స్ దాడులు నామమాత్రంగా మారడం ఆందోళన కలిగిస్తోంది. వ్యవసాయశాఖ పూర్తిస్థాయిలో దాడులు చేస్తే యూరియా కొరత ఉండదని, రైతులను అధిక ధర లతో నిలువు దోపిడీ చేయడం వంటి ఘటనలు ఉండేవి కాదనే వాదనలు వినిపిస్తున్నాయి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పీలేరు : కేక్‌కట్ చేస్తున్న కూటమి నాయకులు

ఘనంగా 'నల్లారి' జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-పీలేరు

ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం నియోజకవర్గం వ్యాప్తంగా నిర్వహించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణంలో కూటమి శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు, నల్లారి అభిమానులు కేక్‌కట్ చేసి, అందరికి పంచిపెట్టారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, శ్రేణులు, అనుబంధ సంఘాలు, మహిళలు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **కలికిరి:** మాజీ సిఎం నల్లారి కిరణ్ కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను పట్టణంలో పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. సత్యనారాయణరెడ్డి, దినకర్, సహకార బ్యాంకు చైర్మన్ నల్లారి చంద్రారెడ్డి, మాజీ సర్పంచ్ నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాలతి కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు వాటర్ షెడ్ రవి, మల్లిరెడ్డి, కంభం వెంకటరమణారెడ్డి, మున్నాలపల్లి వెంకటరమణ, మాజీ ఎంపిటిసి జనార్దన్ గౌడ్ సహదేవరెడ్డి, పి.వెంకటరెడ్డి వేంపల్లి అబ్దుల్ ఖాదర్, ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ అస్లాం, వైజాగ్ బాషా పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికి కేక్ తినిపించారు. కార్యక్రమంలో అన్వర్ బాషా, రామచంద్ర నాయుడు, మహేష్ రెడ్డి, నరసింహారెడ్డి,మల్లికార్జున, వేణు, శివకృష్ణ, శివారెడ్డి, గండికోట గణేష్, విద్యాసాగర్ పాల్గొన్నారు. **కలకడ:** ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించిన నిర్వహించారు. నాయకులు పొత్తూరి ప్రభాకర్ నాయుడు, మద్దిపట్ల వెంకటరమణ నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బరకం శ్రీనివాసులురెడ్డి, మాజీ జడ్‌పిటిసి తిరుపతి నాయుడు, ఎంపిటిసి చంద్రమోహన్, సర్పంచ్‌లు వెంకటరమణ, విశ్వనాథ నాయుడు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు రామాంజులు, జనార్దన్ నాయుడు, కమలనాథ, త్యాగరాజు పాల్గొన్నారు. **గుర్రంకొండ:** ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను కూటమి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు నాయని జగదీష్, ఎల్లుట్ల మురళి, మేకల చలపతి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కలికిరి

మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలు నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతల రమేష్ కుమార్‌రెడ్డి, నాయకులు రత్నశేఖర్‌రెడ్డి, ఎంఐ హనీఫ్, శివాజీ, భాస్కర్‌రెడ్డి, వెంకటపతి, ఎస్.టి.డి.హరి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, ధనుంజయ, బాబురెడ్డి, మహేంద్రరెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఇస్తియాక్, నూరు, వేణుగోపాల్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, శామ్యూల్, నరేష్, యుగంధర్, హాసన్ అలి, మునిరెడ్డి, జాహిద్, గణేష్, జగన్మోహన్, సహాదేవ, రామ, రఘు, రామచంద్ర, ఆటో విజయ్, ఆఫ్రిద్దీన్ పాల్గొన్నారు.

22 నుంచి సప్పలమ్మ నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్: మండలంలోని సిటిఎం క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ సప్పలమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2 వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు సర్పంచ్ బండపల్లె ఈశ్వరమ్మ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ రోజూ సాయంత్రం అమ్మవారికి అభిషేకం, అలంకరణ వేడుకగా నిర్వహిస్తారన్నారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, కొబ్బరినీళ్లు, ఇతర పండ్ల రసాలతో విశేషంగా అభిషేకం చేస్తారని చెప్పారు. మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు. అక్టోబరు 2 విజయదశమి రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు, దుర్గాష్టమి రోజున చండీ హోమం నిర్వహిస్తారని తెలిపారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

రూ. 32 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కాశినాయన: మండలంలోని ఇటుకలపాడు , సావిశెట్టిపల్లె , కొండరాజు పల్లె, వరికుంట్ల గ్రామాల చెరువులకు బ్రహ్మ సాగర్ ఎడమ కాలువ నుంచి లిఫ్ట్ ద్వారా చెరువులకు నీరు నింపేందుకు రూ. 32 కోట్లతో పనులు ప్రారంభించారు. శనివారం బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి రితీష్ రెడ్డి, బొజ్జ రోషన్న, బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నరిశెట్టి సుప్రజ కాంట్రాక్టర్ పద్మనాభ రెడ్డి కలసి సావిశెట్టిపల్లె దగ్గర శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా రితీష్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాశినాయన మండలంలో తెలుగు గంగ కాలువకు ఎగువన ఉండే గ్రామాల ప్రజలకు ఐదువేల ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యమని చెప్పారు. రైతులు ఎలాంటి ఇబ్బంది పడకూడదని తాము పనులు ప్రారంభించామని చెప్పారు. కాశినాయన మండలంలో ఎమ్మెల్సీ సొంత మండలం అయిన ప్పటికీ ఆయన చేసింది ఏమీ లేదని వాపోయారు. లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు రైతులందరూ కాంట్రాక్టర్‌కు సహకరించి ఎటువంటి ఆటంకం కలగకుండా దగ్గర ఉండి పనులు చేయించుకోవాలని, కార్యక్రమంలో కాంట్రాక్టర్ జోగ్గారిపల్లె తిరుమలరెడ్డి , డిప్యూటీ తహశీల్దార్ రవిశంకర్, ఎస్ఐ యోగేంద్ర పాల్గొన్నారు.

భూమి సాధించే వరకూ పోరాటం

ప్రజాశక్తి-కాశినాయన: మండల పరిధిలోని కత్తెర గండ్ల పంచాయతీలో గల శివాలయం భూమి ఎవరైతే కబ్జా చేశారో వారి దగ్గర నుండి చట్ట పరంగా వచ్చేంతవరకు శివాలయం కమిటీ తరపున తాము పోరాడుతూ ఉంటామని కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గంగాధర్ ఆచారి అనే భక్తులు ఆలయ కమిటీ సభ్యుల పేరు మీద 35 సెంట్లు రిజిస్టర్ చేయించారని ఆ స్థలాన్ని పోరుమామిళ్ల వైసిపి నాయకులు కరెంటు రమణారెడ్డి దౌర్జన్యంగా కబ్జా చేశారని చెప్పారు. పైగా వెంచర్ స్థలాన్ని విక్రయించుకున్నారని వాపోయారు. ఇది ఏమి అన్యాయమని అడిగితే తమపై బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో రెవెన్యూ, పోలీసు అధికారులు తమకు న్యాయం చేయాలని కనుకనే కోర్టును ఆశ్రయించామని చెప్పారు. సమావేశంలో శివాలయం కమిటీ చైర్మన్ బైరిశెట్టి శ్రీనివాసులు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

తేక్వాండోలో చిన్నారుల విజయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రైల్వే కోడూరులో నిర్వహించిన జిల్లాస్థాయి తేక్వాండో పోటీలలో అండర్ - 19 విభాగంలో కడప చిన్నారులు విజయం సాధించారు. 44 కిలోల విభాగంలో ఎన్.నాగమోక్షిత విజయం సాధించి రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. 55 కిలోల విభాగంలో పి.వి. ఎస్.రెడ్డమ్మ, 59 కిలోల విభాగంలో కె.ఆర్ రెడ్డి బంగారు పతకం సాధించారు. బాలుర విభాగంలో 54 కిలోల విభాగంలో కె.ఆర్.సాత్విక్ రెడ్డి బంగారు పతకం సాధించారు. 85 కిలోల విభాగంలో వి.ముని చైతన్య బంగారు పతకం సాధించి, రాష్ట్రస్థాయికి అర్హత సాధించారు. కార్యక్రమంలో అండర్ 19 జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, పూర్వ కార్యదర్శి శారద, కోచ్ ఆంజనేయులు పాల్గొన్నారు.

మహారాజరాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) రాజంపేట

O.S.No. 16/2024

కొలూరి రమణారెడ్డి, S/o క్రిష్ణారెడ్డి, వ్యాపారము, నివాసం మంగంపేట పోస్టు, ఓబులవారిపల్లె మండలం, అన్నమయ్య జిల్లా. ...వాది

Vs

గుండాలపల్లి ప్రసూన్న ఆంజనేయరాజు, S/o జి.గంగరాజు, వ్యాపారము, నివాసము ఏల్పులవారిపల్లి గ్రామము, కొత్తపేట (పోస్టు), పుల్లంపేట మండలం, అన్నమయ్య జిల్లా. ...ప్రతివాది నెం.2

వాది ప్రతివాది నెం.2 అయిన మీ మీద పై కోర్టులో దావా వేసియున్నారు.వాది షెడ్యూలు ఆస్థిని 17.11.2014 తేదీన కొనియున్నారు. ఈ షెడ్యూలు ఆస్థిని I.P.No.10/2017 చూపి డిక్రీ పొందియున్నారు. ఈ I.P.No.10/2017 డిక్రిని రద్దు చేయమని పై కోర్టులో దావా వేసినారు. మీకేమైనా ఆక్షేపణలు వున్న యెడల 16.09.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో హాజరై స్వయంగా గాని, వకీలు ద్వారా గాని మనవి చేసుకోవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//By Order of the Court//

పి.నాగార్జునుడు, M.A.,LL.M.,
వాదిపరం అడ్వకేటు,
రైల్వేకోడూరు.

పేదలకు వరం సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

లబ్ధిదారునికి చెక్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మి

ప్రజాశక్తి - పుల్లంపేట

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ప్రభుత్వ విప్ ఆరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి తెలియజేశారు. శనివారం ఓబులవారిపల్లి, పుల్లంపేట మండల పరిధిలో వివిధ గ్రామాలకు వెళ్లి బాధితులకు ఇంటి దగ్గరే సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. ఓబులవారిపల్లికి చెందిన నూక నికితకు రూ.69,086, సయ్యద్ అష్రాఫ్ అలీకి రూ.52,800, నూక మురళీమోహన్‌రెడ్డికి రూ.25,800, ఓబులవారిపల్లి మండలం శివ శంకరాపురం గ్రామానికి చెందిన కటికం తులసమ్మకు రూ.52,800, గాదెల వెంకటరాపురానికి చెందిన నంది మండలం లలితమ్మకు రూ.42,746, గాదెల గ్రామానికి చెందిన వంగినేని రాధమ్మకు రూ.33,332, సున్నపురాళ్లపల్లి గ్రామానికి చెందిన మునగ భాగ్యమ్మకు రూ.44,270, కొర్లకుంట గ్రామానికి చెందిన మల్లు వెంకటరెడ్డికి రూ.40,785, బోటిమీదపల్లి గ్రామానికి చెందిన కొప్పుల చరణ్ తేజ తరపున అతని తల్లి కొప్పుల సుగుణమ్మకు రూ.36,739, పెద్దవరంపాడు గ్రామానికి చెందిన సత్తులూరి దేవేంద్ర తరపున తండ్రి నాగభూషణంకు రూ.30,786, అప్పగుంటపల్లి గ్రామానికి చెందిన ఆనిక శ్రీనివాసులుకు రూ.66,713 చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీధర్, వరలక్ష్మీ మాట్లాడుతూ ప్రజలు కష్టాలలో అండగా నిలబడటమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎన్నో వేలాది కుటుంబాలకు అండగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిలుస్తున్నారని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం వల్లే రైల్వేకోడూరు అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు.

అవినీతి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దామని, అవినీతి అధికారులను నిలదీద్దామని యాంటీ క్రైమ్ బ్యూరో అఫ్ ఇండియా మీడియా సెల్ రాష్ట్ర అధ్యక్షులు సైద్ మీర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బైపాస్ రోడ్డులో ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో యాంటీ క్రైమ్ బ్యూరో అఫ్ ఇండియా ఛలో మదనపల్లి బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు అన్నిరంగాల్లో అవినీతి పెచ్చుమిరిపోయిందని, దీనిపై తాము రాజీలేని పోరాటం సాగిస్తున్నామని ప్రకటించారు. ముఖ్యంగా వృత్తి, ఉద్యోగ, వ్యాపార, వాణిజ్య వర్గాలలో అవినీతికి అండగా ఉంటామని స్పష్టం చేశారు. అవినీతిపై అనేక విధాలుగా పోరాటం సాగించడంతో పాటు, కోర్టులో కేసులు వేశారని గుర్తుచేశారు. ఎపి అవినీతి నిరోధక రాష్ట్రంగా తీర్చిదిద్దడమే యాంటీ క్రైమ్ బ్యూరో అఫ్ ఇండియా లక్ష్యమని వెల్లడించారు. ఇందులో భాగంగానే ఛలో మదనపల్లి కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. ఇప్పటి వరకు 1,040 మంది అవినీతి అధికారులను గుర్తించామని, తద్వారా రూ.77,850 కోట్లు అవినీతి జరిగిందని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయిని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామన్నారు. అవినీతిని వెలికితీసే క్రమంలో తనపై కొన్ని వ్యవస్థలు అనేక రకాల దాడులు చేయడమే కాకుండా కేసులు నమోదు చేశారని గుర్తుచేశారు. అవినీతి అధికారులను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవినీతిపరుల నుండి కోట్లాది రూపాయలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే స్వర్ణాంధ్రప్రదేశ్ సాకారం చేయడం సుసాధ్యమన్నారు. కార్యక్రమంలో ఐహెచ్‌ఆర్‌పిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ, హజరత్ హాఫిజ్ ఒఖారి మహమ్మద్, హైకోర్టు న్యాయ వాది జె.మనోజ్ కుమార్, రాయలసీమ ఎస్‌సి, ఎస్‌టి మహిళా సంఘం అధ్యక్షులు విజయ కుమారి, అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కె.హనుమంతు పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సైద్‌మీర్

మదనపల్లె జిల్లా ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలి

సమావేశంలో మాట్లాడుతున్న రెడ్డి సాహెబ్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె జిల్లా ఏర్పాటు పై స్పష్టమైన ప్రకటన చేసి ప్రజల్లో నెలకొన్న అనుమానాలు తొలగించాలని జిల్లా సాధన ఉద్యమకారులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఎస్. రెడ్డి సాహెబ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం ఇప్పటివరకు మదనపల్లెకు ఒక్కసారి కూడా రాలేదని, ప్రజల అభిప్రాయాలు సేకరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మదనపల్లె జిల్లా చేస్తామని హామీ ఇచ్చిన విషయం అందరికీ తెలిసిందేనని గుర్తు చేశారు. కూటమి అనుకూల పత్రికలలో వచ్చిన కొత్త జిల్లాల కసరత్తు వార్తల్లో ఎక్కడా మదనపల్లె జిల్లా ప్రస్తావన లేకపోవడం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. మార్కాపురం, అమరావతి, రంపచోడవరం కేంద్రంగా కొత్త జిల్లాల ప్రతిపాదనలు వినిపిస్తున్నప్పటికీ మదనపల్లె జిల్లా ఏర్పాటుపై ఎలాంటి చర్యలు కనిపించడంలేదని పేర్కొన్నారు. జిల్లా ఏర్పాటుపై స్పష్టత లేకపోతే మళ్లీ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఎమ్మెల్యేలు చొరవ చూపి మదనపల్లె జిల్లా ఆకాంక్షలను నెరవేర్చేలా చూడాలని, అది వారి బాధ్యత అని సమావేశంలో తీర్మానించారు. సమావేశంలో బిసికె పార్టీ బాస్ అధ్యక్షులు పిటిఎం శివ ప్రసాద్, సిపిఐ నాయకుడు కృష్ణప్ప, బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీ చందు, మురళి, రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు ఎస్‌కే భాషా, టౌన్ మైనార్టీ నాయకులు మహబూబ్ పీరు, ఖాసీంవలి, బిసి సంఘం నాయకులు జయశంకర్, గిన్నెల మనోహర్ రెడ్డి, బాస్ నాయకులు తలారి కృష్ణ, రవి, జనార్ధన్ పాల్గొన్నారు.

మాటల మాంత్రికుడు ఆత్రేయ

- ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

సినిమాల్లో మనసుకు సంబంధించిన పాటలు ఎక్కువగా రాసి, మానవ జీవిత తత్వాన్ని గుట్టు విప్పిన ఆత్రేయ 'మనసు కవి'గా, మన 'సుకవి'గా ప్రసిద్ధులయ్యారని వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా రచయితల సంఘం శనివారం కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ కార్యాలయంలో ఆచార్య ఆత్రేయ 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మొదట ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ నాటక రచయితగా, రంగస్థల నటుడిగా ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న ఆత్రేయ సినిమా రంగంలో ప్రవేశించి దర్శకుడిగా, నిర్మాతగా, పాటలు, సంభాషణల రచయితగా గొప్ప కీర్తి ప్రతిష్టలు సంపాదించుకున్నారని పేర్కొన్నారు. ఆయన సినిమా ప్రేక్షకుల్ని కంటతడి పెట్టించి వారి గుండెల్లో పదిలమైన స్థానం సంపాదించారన్నారు. మొదటిసారిగా దీక్ష సినిమాకు పాటలు రాసిన ఆత్రేయ 400 సినిమాలకు దాదాపుగా1400 పాటలు రాశారని, ప్రతిపాట మన మనసుని తాకి ఆనందాన్ని కలిగిస్తుందని తెలిపారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి మాట్లాడుతూ ఆత్రేయ పరివర్తన, ఎన్‌జిఒ, కప్పలు, ఈనాడు, విశ్వశాంతి, భయం, మాయ, సామ్రాట్ అశోక, గౌతమ బుద్ధ మొదలైన నాటకాలు రాశారని చెప్పారు. ఆయన రాసిన నాటకాలు, నాటికలు వందలసార్లు ప్రదర్శింపబడి ప్రేక్షకాదరణ పొందాయన్నారు. దాసరి సుధాకర్ మాట్లాడుతూ ఆత్రేయ పాటలు రాసిన మంచి మనసులు, డాక్టర్ చక్రవర్తి, బడిపంతులు, మూగమనసులు, ప్రేమనగర్, స్వాతిముత్యం, అంతులేని కథ, మరోచరిత్ర మొదలైన గొప్ప చిత్రాలు ఆయన పాటలతోనే విజయం సాధించాయని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. ఇంకా పలువురు ప్రముఖ రచయితతలు ప్రసంగించారు. కార్యక్రమంలో కళాకారులు రామనపల్లి శంకర్, వీరదాసరి ప్రకాష్, యడవల్లి రామలింగయ్య, మందల చిన్నయ్య, గడికోట రెడ్డయ్య, మందల మురళి, ఎం.వెంకటసుబ్బయ్య, ఎన్.రామ సుబ్బారెడ్డి, బి.బాల ఓబయ్య, ఎస్. వీరయ్య పాల్గొన్నారు.

ఆత్రేయ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లికార్జునరెడ్డి, రచయితలు

రాయలసీమ రత్నం 'ఫాతిమా'

ఎన్‌టిఆర్ యూనివర్సిటీ విసితో ఫాతిమా మెడికల్ కళాశాల సిబ్బంది

ప్రజాశక్తి - కడప అర్బన్

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపలో రాయలసీమ రత్నంగా ఫాతిమా మెడికల్ కళాశాల వెలుగొందుతుందని డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ విసి డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శనివారం ఫాతిమా మెడికల్ కళాశాలను విసి సందర్శించారు. కళాశాల కరస్పాండెంట్ ఎ.క్యూ. జవ్వాద్ సాదరంగా ఆహ్వానించారు. ప్రిన్సిపల్ డాక్టర్ శైలా రేఖ, సూపరింటెండెంట్ డాక్టర్ నగేష్, అన్ని విభాగాల అధిపతులు, వైద్యులు, వైద్య విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ వైద్య వృత్తిలో నైపుణ్యాన్ని ఎలా పెంచుకోవాలో తెలిపారు. విద్యార్థుల్లో నూతన ఉత్తేజాన్ని నింపారు. కష్టపడి చదివి మంచి డాక్టర్లుగా ఎదగాలని ఆకాంక్షించారు. వైద్య విద్యను అభ్యసించాలనే ప్రతి ముస్లిం విద్యార్థులకు కలల సౌధం ఫాతిమా మెడికల్ కళాశాలని పేర్కొన్నారు. భవిష్యత్తులో కళాశాల మరింత అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. కరస్పాండెంట్ జవ్వాద్ మాట్లాడుతూ కళాశాలను సందర్శించిన విసికి కృతజ్ఞతలు తెలిపారు. విసి మంచి వ్యక్తిత్వం కలవారని కొనియాడారు. కర్నూల్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్‌గా, సూపరింటెండెంట్ గా పనిచేసి కార్డియాలజీ విభాగాన్ని స్థాపించారని పేర్కొన్నారు. అనంతరం విసిని ఘనంగా సత్కరించారు.

కడప రిమ్స్‌ను అభివృద్ధి దిశగా తీసుకెళ్లండి

ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) అభివృద్ధికి ప్రతి ఒక్క అధికారి కృషి చేయాలని డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వి.చంద్రశేఖర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం ఆయన కడప రిమ్స్‌ను సందర్శించారు. అన్ని విభాగాల హెచ్‌డీలతో సమావేశమయ్యారు. రిమ్స్ వైద్య కళాశాల చాలా విస్తీర్ణంగా ఉందని, ఆవరణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య కళాశాల గెస్ట్ హౌస్, కళాశాల క్యాంటీన్, కళాశాల ఆడిటోరియం, ప్లే గ్రౌండ్‌ను త్వరలో ఏర్పాటు చేయాలన్నారు. ఆ తర్వాత పీజీ, యూజీ వైద్య విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. వైద్య విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి. జమున, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కెఎస్ఎస్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ విజయభాస్కర్ రెడ్డి, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వై.శ్రీనివాసులు, అన్ని విభాగాల హెచ్ఒడిలు, వైద్యులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న దాతలు

అన్నదాన ట్రస్టుకు రూ.1.70 లక్షల విరాళం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

అన్నదాన ట్రస్టు షెడ్ నిర్మాణ నిమిత్తం సొగసాని రెడ్డప్పరెడ్డి, రామిగానివారిపల్లి, కురబలకోట మండలానికి చెందిన అంజనాదేవి, సొగసాని భయ్యారెడ్డి (నీరుగట్టువారిపల్లి) రూ.1.70 లక్షల చెక్కు అందించారు. వారికి అన్నదాన ట్రస్టు తరుపున ధన్యవాదాలు తెలియజేశారు.

నెల రోజులుగా ఆగని జ్వరాలు

- కీళ్లు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-గాలివీడు

నెలరోజులుగా కొప్పలవాండ్లపల్లి వాసులు జ్వరాలతో అల్లాడుతున్నారు. కీళ్లు, మోకాళ్ల నొప్పులు బాధపడుతున్నారు. ఒకటి, రెండు, వారం రోజులు కాదు నెల రోజుల నుంచి జ్వరాలతో మంచానికి పరిమితమయ్యారు. ప్రతి కుటుంబంలో ఒకరి చొప్పున జ్వరంతో బాధపడుతున్నారు. ఇప్పటికే చాలా మంది బాధితులు రాయచోటి పట్టణానికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. వైద్యుల సూచనలు, సలహాల ప్రకారం మందులు వాడినా వొళ్లు, కీళ్లు, మోకాళ్ల నొప్పులు తగ్గడం లేదని జ్వరపీడితులు వాపోతున్నారు. వైద్యులను అడిగినా తగ్గడానికి ఎన్ని రోజులు పడుతుందో చెప్పలమేని చెబుతున్నాయని పేర్కొన్నారు.

చీమలచెరువుపల్లి పంచాయతీ కొప్పలవాండ్లపల్లిలో 40 కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. ఒక ఇంట్లో ఎంత మంది ఉంటే అందరూ జ్వరంతో బాధపడుతున్నారు. చాలా మంది రాయచోటి పట్టణంలోని మహేశ్వర రాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. నెల రోజులుగా మోకాళ్లు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్నామని కొప్పలవాండ్లపల్లికి చెందిన దిద్దేకుంట శ్రీకాంత్ రెడ్డి, పద్మావతి పేర్కొన్నారు. ఎంత వైరల్ ఫీవర్ అయినా వారం, పది రోజుల్లో కీళ్లు, మోకాళ్ల నొప్పులు తగ్గుతాయని, కానీ కొందరికి తగ్గడం లేదని వైద్యులు చెబుతున్నారు. మరో వైపు నొప్పులు తట్టుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జ్వరాలైతే తగ్గుతున్నాయని, నొప్పులు మాత్రం నెలల తరబడి ఉంటున్నాయని పేర్కొంటున్నారు. ప్రభుత్వమే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి మెరుగైన చికిత్స అందించాలని జ్వరబాధితులు వేడుకుంటున్నారు.

ఎపిఐఐసి డైరెక్టర్‌గా కొండా భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, మండల పరిధిలోని కాటిమాయకుంట గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ కొండా భాస్కర్‌రెడ్డి ఎపిఐఐసి డైరెక్టర్‌గా నియమితులయ్యారు. శనివారం రాత్రి ప్రభుత్వం మరో మూడు కార్పొరేషన్లకు 33 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇంఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కు 16 మంది డైరెక్టర్లను నియమించగా, అందులో కొండ భాస్కర్‌రెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సందర్భంగా కొండ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడే వారికి తప్పనిసరిగా గుర్తింపు లభిస్తుందిన్నారు. తనను ఎపిఐఐసి డైరెక్టర్‌గా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావు, తన నియామకానికి సహకరించిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి,ఆయన సోదరుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బకాయిలు చెల్లించి ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఆర్‌టిసిలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా ఫలితం శూన్యమని ఆర్‌టిసి ఇయు రాష్ట్ర అధ్యక్షులు దామోదరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఆర్‌టిసి ఇయు కడప జోన్ సమావేశం జోనల్ అధ్యక్షులు కె.కె.కుమార్ అధ్యక్షతన, జోనల్ కార్యదర్శి ఎన్. రాజశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఆరేళ్లుగా ఉద్యోగోన్నతుల కోసం ఎదురు చూస్తున్న సుమారు 6 వేల మంది ఉద్యోగులు నిరుత్సాహానికి గురి అవుతున్నారని పేర్కొన్నారు. సిఎం ఉద్యోగోన్నతులపై ఆమోదం ఇచ్చినా కింది స్థాయి అధికారులు అడ్డంకులు సృష్టించడం వలన ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. జిఎడిలో ఉన్న ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ముఖ్యమంత్రి ఇచ్చిన అనుమతులకు అంగీకారం తెలియజేస్తూ జిఒను విడుదల చేసేలా చూడాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఇ.యు రాష్ట్ర నాయకులు పి.సుబ్రమణ్యంరాజు, సి.నబిరసూల్, కె.మద్దిలేటి కె.అర్జున పాల్గొన్నారు.

ప్రేమాలయంలో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : తెలుగుదేశం పార్టీ నాయకులు గుడిపాటి గోపీనాథ్ ఆధ్వర్యంలో 2వ డివిజన్ కార్పొరేటర్ ముక్కర సుబ్బారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో కేక్ కట్ చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుబ్బారెడ్డి మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా గోపీనాథ్ సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షనీయమన్నారు. వృద్ధులు, నిరాశ్రయుల మధ్య పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. టిడిపి ఎన్నారై కువైట్ ఉపాధ్యక్షులు షేక్.రహమతుల్లా, గోపీనాథ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును స్ఫూర్తిగా తీసుకుని కడప జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాస రెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి సహకారంతో 2వ డివిజన్ అభివృద్ధికి కార్పొరేటర్ సుబ్బారెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో రాజా, సాధు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆశలు ఖననం : కాంగ్రెస్

ప్రజాశక్తి- కడప అర్బన్ : మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ వల్ల పేద, మధ్య తరగతి విద్యార్థుల ఆశల ఖననమే అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ అన్నారు. శనివారం ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం 5వ డివిజన్ అశోక్ నగర్ లో నిర్వహించారు. అక్కడ ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గౌస్ పీర్, జిల్లా ఉపాధ్యక్షులు సిరాజుద్దీన్ మాట్లాడుతూ పిసిసి అధ్యక్షురాలు షర్మిల, డిసిసి అధ్యక్షురాలు విజయ్ జ్యోతి సహాయ సహకారాలతో ఇంటింటికి కాంగ్రెస్ కార్యక్రమం నిర్విరామంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రయివేటీకరణతో దేశ ప్రగతి ముందుకు సాగదని, ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని హితవు పలికారు. ప్రయివేటీకరణ వల్ల ధనవంతులు మరింత సంపదపరులు అవుతారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం ఎక్కువ మెడికల్ కళాశాలలు తెచ్చామని చెబుతోందని, కానీ ఎక్కడ కనిపించడం లేదని తెలిపారు. అన్ని పిల్లర్ల దశలోనే ఆగిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో 5వ డివిజన్ ఇన్‌ఛార్జులు ఫజలుల్లా, ఇతర డివిజన్ ఇన్‌ఛార్జులు దాసరి శ్రీనివాసులు, శివ, జి.వి. అంజన్ కుమార్, యూసుఫ్, జాబీర్, మస్తాన్, రెడ్డయ్య, అబ్దుల్ రౌఫ్, నీలం, షామీర్, ముబారక్, సిద్ధిక్, అహ్మద్, ఇమామ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్

ప్రజాశక్తి- కడప అర్బన్ : రాష్ట్ర గిడ్డంగుల సంస్థ డైరెక్టర్ మురురికినాటి శ్రీధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు ఆయన కృతజ్ఞతలు తెలి పారు. కడప నియోజకవర్గం రెండవ డివిజన్ దేవుని కడపలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి 35 ఏళ్లుగా కష్టపడి పని చేస్తున్నానని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం తన కష్టాన్ని గుర్తించి రాష్ట్ర డైరెక్టర్ పదవి ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. పదవి వచ్చేందుకు సహకరించిన ఎమ్మెల్యేమాధవి, జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.